News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :91 | ఖమ్మం | ఆదివారం, మే 18, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## హరీశ్, కవిత డమ్మీ అయ్యారు... బీఆర్ఎస్ చీలిపోతుంది

- బీఆర్ఎస్‌లో 'నాలుగు స్తంభాలాట' నడుస్తోందన్న బీజేపీ నేత ఏలేటి
- హరీశ్ రావు నేతృత్వంలో పార్టీ చీలిక దిశగా అడుగులు వేస్తోందని వ్యాఖ్య
- కేటీఆర్‌కు అన్నీ కట్టబెట్టడంపై కవిత తీవ్ర అసంతృప్తిగా ఉన్నారన్న ఏలేటి



బీఆర్ఎస్ లో తీవ్రమైన అంతర్గత విభేదాలు నడుస్తున్నాయని, ఇది పార్టీ చీలికకు దారితీయవచ్చని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు నేతృత్వంలో బీఆర్ఎస్ చీలిపోయే దిశగా అడుగులు పడుతున్నాయని ఆయన జోస్యం చెప్పారు. కేవలం పది మంది ఎమ్మెల్యేలు పార్టీని వీడితే బీఆర్ఎస్ శాసనసభాపక్షం చీలిపోవడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంలోనే తండ్రి, కొడుకు, కూతురు, అల్లుడి మధ్య తీవ్రమైన విభేదాలున్నాయని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఇటీవల జరిగిన పార్టీ రజతోత్సవ సభలో కేటీఆర్‌కే పూర్తి ప్రాధాన్యత దక్కిందని, హరీశ్ రావు, కవితలకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదని, వారిని డమ్మీలుగా మార్చేశారని విమర్శించారు. కేసీఆర్ కూడా అనారోగ్య

వివరాలు 2లో..

# మహిళా శక్తితోనే మళ్లీ అధికారంలోకి

### కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- ప్రతి ఆడబిడ్డకూ వెల్త్ నుంచి హెల్త్ ఐడీ కార్డు
- వాళ్లకు ఏటా ఆరోగ్య పరీక్షలు జరిగేలా ఏర్పాట్లు
- స్వయం సంఘాల చేతికి కార్పొరేట్ వ్యాపారం
- పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు ఇచ్చాం
- ఉచిత ప్రయాణంతో లాభాల బాటలోకి ఆర్టీసీ
- 16 నెలల్లో ప్రభుత్వం ఆర్టీసీకి 2 వేల కోట్లు ఇచ్చింది

**వీహబ్ విమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంలో సీఎం రేవంత్**



కోటి మంది మహిళలను కోటీశ్వరు లను చేయాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే అంబానీ చేసే పెట్రోల్ వ్యాపారమైన, అదాని చేసే సోలార్ పవర్ బిజినెస్ అయినా అతివలకే అప్పగించామని అన్నారు. ప్రభుత్వం రెండో సారి కూడా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇవాళ జూబ్లీ హిల్స్ జేఆర్సీ కన్వెన్షన్లో ఏర్పాటు చేసిన వీహబ్ విమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంలో ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. నారాయణపేటలో స్వయం సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభించామని, మరిన్ని త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. సోలార్ పవర్ అనగానే అందరికీ అదానీ గుర్తొస్తారని, మనం వెయ్యి మె గావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లను మహిళా సంఘాలకు ఇచ్చామని అన్నారు. మరో వెయ్యి. మెగావాట్ల ప్లాంటు ఇవ్వడంతోపాటు ఉత్ప త్తి అయిన కరెంటు కొనుగోలు చేసేందుకు సర్కారు సిద్ధంగా ఉందని క్లారిటీ ఇచ్చారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసి తెలంగాణ మహిళలను ముందు వరుసలో ని లుపుతామని చెప్పారు. వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ తెలంగాణే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.

వివరాలు 2లో..

**వెల్త్ టు హెల్త్ కార్డులు**

ప్రతి ఆడబిడ్డకు సంబంధించిన సమగ్ర సమాచారంతో కూడిన ఐడెంటిటీ కార్డులు జారీ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఆర్థిక పరమైన అంశాల నుంచి ఆరోగ్య పరమైన సమస్యల వరకు క్యూఆర్ కోడ్తో కూడిన కార్డు ఇవ్వాలని సూచించారు. ప్రతి ఏటా ఆడబిడ్డలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని, ఇందుకు సంబంధించిన సమాచారం ఆ కార్డు స్కాన్ చేస్తే వచ్చేలా ఉండాలని అన్నారు.

## త్వరలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ



హైదరాబాద్: త్వరలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం (మే 17) జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో హైదరాబాద్ ఇన్ చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ రివ్యూ మీటింగ్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్ వీ కర్ణన్, జోనల్

వివరాలు 2లో..

## 2017 నాటి కేసు.. మంత్రి శ్రీధర్ బాబుపై కేసు కొట్టివేత

- కాళేశ్వరం భూ సేకరణ వివాదం కేసులో మంత్రి శ్రీధర్‌బాబుకు ఊరట
- శ్రీధర్‌బాబు సహా 13 మందిపై నమోదైన కేసును కొట్టివేసిన నాంపల్లి కోర్టు
- 2017లో కాంగ్రెస్ నేతలపై కేసు నమోదు చేసిన గత ప్రభుత్వం
- న్యాయమే గెలిచిందని, ఇది రైతుల విజయమని శ్రీధర్‌బాబు వ్యాఖ్య

వివరాలు 2లో..




## నీట్ పరీక్ష ఫలితాలకు బ్రేక్.. స్టే విధించిన మద్రాస్ హైకోర్టు

- నీట్ యూజీ 2025 ఫలితాల విడుదలకు బ్రేక్
- మద్రాస్ హైకోర్టు మధ్యంతర స్టే ఉత్తర్వులు
- మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ బెంచ్ కూడా తాత్కాలిక నిలుపుదల
- పరీక్షా కేంద్రంలో కరెంట్ కోతపై విద్యార్థుల పిటిషన్
- జూన్ 2కు విచారణ వాయిదా వేసిన మద్రాస్ హైకోర్టు



దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న నీట్ యూజీ 2025 ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ ఫలితాలపై మద్రాస్ హైకోర్టు స్టే విధిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 2లో..

## అలా చేస్తే కఠిన చర్యలు: రియల్టర్లు, బిల్డర్లకు హైడ్రా కమిషనర్ హెచ్చరిక

- చెరువులో మట్టి పోస్తే కఠిన చర్యలు ఉంటాయని వెల్లడి
- శిఖం భూమిలో అయినా సడలింపు లేదని స్పష్టీకరణ
- ఫిర్యాదుల కోసం ప్రత్యేక ఫోన్ నంబర్ కేటాయింపు



చెరువుల్లో మట్టి, నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై కఠిన చర్యలు తప్పవని 'హైడ్రా' స్పష్టం చేసింది. చెరువుల పరిరక్షణ విషయంలో ఉపేక్షించేది లేదని, నిరంతర నిఘా ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తేల్చిచెప్పింది. ఈ మేరకు శనివారం రియల్ ఎస్టేట్ సంస్థలు, బిల్డర్లు, రవాణాదారులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులతో హైడ్రా

వివరాలు 2లో..

## వైసీపీని నాశనం చేయడమే చంద్రబాబు లక్ష్యం



- లేని మద్యం స్కామ్ లో జగన్ ను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారన్న భూమన
- ప్రతీకార రాజకీయాలు చేస్తున్నారని విమర్శ
- చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిక

వివరాలు 2లో..

## రేవంత్ కు ఉత్తమ్ నుంచి ప్రమాదం పొంచి ఉంది

- కాంగ్రెస్ సర్కారును కూల్చే ఉద్దేశం మాకు లేదన్న గంగుల
- ఐదేళ్లు వాళ్లు పాలిస్తేనే ప్రజలకు కేసీఆర్ విలువ తెలుస్తుందని వ్యాఖ్య
- రేవంత్‌కు సొంత పార్టీ నేతలతోనే అసలు సమస్య అన్న గంగుల



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వా న్ని కూల్చే ఉద్దేశం తమకు ఎంతమాత్రమూ లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

**దేశంలో మొదటిసారిగా తడి చెత్త, పొడి చెత్త**

## సేకరణను తెనాలి మున్సిపాలిటీ ప్రారంభించడం గర్వకారణం

- తెనాలిలో వివిధ కార్యక్రమాలను పరిశీలించిన మంత్రి నాదెండ్ల
- ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్న వైనం
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపు



భారతదేశంలో మొట్టమొదటిసారిగా తడి చెత్త, పొడి చెత్త వేర్వేరు సేకరణను తెనాలి మున్సిపాలిటీ ప్రారంభించడం గర్వకారణం అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర సంకల్పంలో భాగంగా ఈరోజు తెనాలిలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్ర మాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులతో కలిసి చేపట్టారు.

వివరాలు 2లో..

## హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై తిరంగా ర్యాలీ..

హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై తిరంగా ర్యాలీ ప్రారంభమైంది. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు వేలాదిగా జనం తరలి వచ్చారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా తిరంగా ర్యాలీలు నిర్వహించాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించింది. అందులో భాగంగా శనివారం (మే 17) ట్యాంక్ బండ్ పై తిరగార్యాలీ చేపట్టారు. ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామీ వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నారు. ర్యాలీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి,



వివరాలు 2లో..

## మన త్రివిధ దళాల శక్తి ప్రపంచానికి తెలిసింది



- అనంతపురం, గుంటూరుల్లో తిరంగా ర్యాలీలు
- ఉగ్రవాద కుట్రలు దేశాభివృద్ధిని అడ్డుకోలేవన్న పయ్యావుల
- మురళీనాయక్ త్యాగాన్ని కొనియాడిన పెమ్మసాని చంద్రశేఖర్

ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో, దేశ సైనికులకు కృతజ్ఞతలు తెలుపుతూ అనంతపురం, గుంటూరు జిల్లాల్లో భారీ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రు లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు,

వివరాలు 2లో..

# దేశంలో మొదటిసారిగా తడి చెత్త, పొడి చెత్త సేకరణను తెనాలి మున్సిపాలిటీ ప్రారంభించడం గర్వకారణం

- మొదటి పేజి తరువాయి

స్వర్ణాంధ్ర –స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం 7 గంటలకు తెనాలి పట్టణం బుర్రిపాలెం రోడ్ లోని శివాజీ చౌక్ వద్ద నుండి బయలుదేరి రాముల వారి గుడి మీదుగా మహాత్మా గాంధీ కూరగాయల మార్కెట్ వరకు మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది చేపడుతున్న వివిధ పారిశుద్ధ్య కార్యక్రమాలను మంత్రి నాదెండ్ల పరిశీలించారు. అవ్వ తాత, అమ్మ ఎలా ఉన్నారు అంటూ మంత్రి ప్రతి ఒక్కరిని పలకరిస్తూ వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు.. తెనాలి పట్టణం బండ్లమూడి వారి వీధి లో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మంత్రి స్వయంగా సైడ్ కాలువలోని చెత్తను తొలగించారు. మహాత్మా గాంధీ కూరగాయల మార్కెట్ మరియు చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల వద్ద నుండి శ్రీ కొడాలి వీరయ్య మున్సిపల్ పార్క్ మీదుగా రావి టవర్స్ వరకు మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న వివిధ పారిశుద్ధ్య కార్యక్రమాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ, ప్రతి నెల మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంతో అందరం కలిసికట్టుగా చేసే స్వచ్ఛంద కార్యక్రమం అన్నారుప్రతి ఒక్కరూ బాధ్యతతో స్వచ్ఛంద కార్యక్రమంలో పాల్గొనాలి మంత్రి పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య పై అవగాహన పెంచుకోవాలని... మన గ్రామం మన పట్టణం స్వచ్ఛంగా ఉంచుకునేలా ప్రతి ఒక్కరు ఈ డ్రైవ్ లో పాలుపంచుకోవాలన్నారు. అందరం కలిసికట్టుగా మన పట్టణాన్ని, మన నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవాలన్నారు.

పట్టణంలోని డంపింగ్ యార్డ్ ను సంవత్సరాల నుంచి నిర్లక్ష్యంగా వదిలేశారని, దాన్ని అక్కడ నుంచి తరలించేందుకుగాను ప్రతిరోజు 75 నుంచి 95 మెట్రిక్ టన్నుల తడి పొడి చెత్త విడివిడిగా సేకరించి, తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలన్నారు.ప్రజల సమస్యలు తెలుసుకునే ఉద్దేశ్యంతో ప్రతి వారంలో ఒక్కో సచివాలయం పరిధిలో అధికారులు ఇంటింటికీ వెళ్లాలని, వారికి మార్గదర్శనం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

# 2017 నాటి కేసు.. మంత్రి శ్రీధర్ బాబుపై కేసు కొట్టివేత

తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుకు కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించిన వివాదంలో నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. ఆయనతో పాటు మరో 12 మంది కాంగ్రెస్ నాయకులపై 2017లో నమోదైన కేసును న్యాయస్థానం కొట్టివేసింది. ఈ తీర్పు వెలువడిన అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ, ఇది రైతుల విజయమని, చివరికి న్యాయమే గెలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. 2017లో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భూసేకరణపై ప్రజా విచారణ జరుగుతున్న సమయంలో భూములు కోల్పోతున్న రైతుల పక్షాన తాము నిలిచామని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తుచేశారు. "రైతుల హక్కులను కాపాడాలని, వారికి న్యాయం చేయాలని వినతిపత్రం ఇచ్చేందుకు వెళితే, అప్పటి ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకుని మాపై వివిధ సెక్షన్ల కింద కేసులు బనాయించింది" అని ఆయన వివరించారు.

దాదాపు ఎనిమిదేళ్లపాటు ఈ కేసు విచారణ కొనసాగిందని, తాజాగా నాంపల్లి కోర్టు ఈ కేసును కొట్టివేయడం సంతోషకరమని శ్రీధర్‌బాబు తెలిపారు. "ఇది ప్రజా విజయం, రైతుల విజయం. పేద రైతుల ఆవేదనను న్యాయస్థానం ఆలకించింది. నాడు అధికారం చేతిలో ఉందని మాపై అక్రమంగా కేసులు పెట్టారు, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేశారు"

అని ఆయన ఆరోపించారు.ప్రస్తుతం ప్రజాస్వామ్యం ఉందని, తాము చట్టాలను గౌరవిస్తూ ముందుకు సాగుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. "మాకు అధికారం ఉందని ఎక్కడా దాన్ని దుర్వినియోగం చేయడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత కూడా సరిగా లేదు. దానిపై విచారణ జరుగుతోంది. తప్పు చేసిన వారు ఎవరైనా సరే, చట్ట ప్రకారం శిక్ష అనుభవించాల్సిందే" అని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

# హరీశ్, కవిత డమ్మీ అయ్యారు... బీఆర్ఎస్ చీలిపోతుంది

- మొదటి పేజి తరువాయి

కారణాలతో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం లేదని, సభలోనూ ఆయన ఉత్సాహంగా కనిపించలేదని తెలిపారు. తన తర్వాత కేటీఆరేనని కేసీఆర్ పరోక్షంగా ప్రకటించారని, ప్రస్తుతం కేటీఆర్ డిఫాల్ట్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారని అన్నారు.కవిత తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, పార్టీలో ఆధిపత్య పోరు తారస్థాయికి చేరిందని మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్పు, పూలే విగ్రహం ఏర్పాటు వంటి కవిత నిర్ణయాలకు పార్టీ నుంచి మద్దతు లభించలేదని గుర్తుచేశారు. పదవులు, ఆస్తులన్నీ కేటీఆర్‌కే కట్టబెడుతున్నారంటూ కవిత లేఖ ద్వారా తన అసమ్మతిని వ్యక్తం చేశారని, త్వరలోనే ఆ లేఖ బయటకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. తనను రాజకీయంగా అణచివేసేందుకు కేటీఆర్ కుట్ర పన్నుతున్నారని కవిత ఆవేదన చెందుతున్నారని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో హరీశ్ రావు, కవితలు బీఆర్ఎస్‌ను చీల్చేందుకు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కేటీఆర్ విదేశీ పర్యటనకు వెళ్లిన వెంటనే, ఈ నెలాఖరులోగా లేదా వచ్చే నెల మొదటి వారంలో బీఆర్ఎస్‌లో చీలిక రావచ్చని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ నాయకత్వంలో ఉంటే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదనే భావనతోనే హరీశ్ రావు, కవిత ఈ వ్యూహానికి పదును పెట్టారని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

# అలా చేస్తే కఠిన చర్యలు: రియల్టర్లు, బిల్డర్లకు హైడ్రా కమిషనర్ హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతకు చెరువుల పరిరక్షణ అత్యంత కీలకమని, ఈ దిశగా హైడ్రా ప్రత్యేక చర్యలు చేపడుతోందని వివరించారు. నిర్మాణ వ్యర్థాలను ఎక్కడ పారబోయాలో బిల్డర్లు, రవాణాదారులు ముందే ఒక అవగాహనకు రావాలని ఆయన సూచించారు."మట్టి తరలింపు కాంట్రాక్టర్‌కు అప్పగించాం, ఆయన ఎక్కడ వేస్తే మాకేంటి?" అనే ధోరణిలో బిల్డర్లు వ్యవహరిస్తే, బాధ్యులందరిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. రవాణా ఖర్చులు ఆదా చేసుకోవడానికి దగ్గరలోని చెరువుల ఒడ్డున వ్యర్థాలు వేస్తే, ఆ వాహనాలను సీజ్ చేయడమే కాకుండా, డ్రైవర్, వాహన యజమానితో పాటు వ్యర్థాలను తరలిస్తున్న నిర్మాణ సంస్థ యజమానిపైనా క్రిమినల్ కేసులు పెడతామని స్పష్టం చేశారు. శిఖం భూముల్లో కూడా ఎలాంటి మట్టినీ నింపరాదని ఆదేశించారు. ఇప్పటికే హైడ్రా పోలీస్ స్టేషన్ కూడా అందుబాటులోకి వచ్చిందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇక్కడ కేసులు నమోదు చేస్తారని తెలిపారు. చెరువుల

వద్ద 24 గంటలూ పటిష్టమైన నిఘా ఉంటుందని కమిషనర్ పేర్కొన్నారు. చెరువుల్లో అక్రమంగా మట్టి, వ్యర్థాలు వేస్తున్న వారి సమాచారాన్ని అందించాలని నగర ప్రజలను హైడ్రా కోరింది. ఇందుకోసం 9000113667 అనే టోల్ ఫ్రీ నెంబర్‌ను కేటాయించినట్లు తెలిపింది. అంతేకాకుండా, హైడ్రా అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించింది.

# మన త్రివిధ దళాల శక్తి ప్రపంచానికి తెలిసింది

- మొదటి పేజి తరువాయి

ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలు చేతబూని, సైనికులకు సంఘీభావం ప్రకటించారు.

అనంతపురంలో ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు జరిగిన ర్యాలీలో మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్ ద్వారా మన త్రివిధ దళాల సత్తా ప్రపంచానికి తెలిసిందన్నారు. ఉగ్రవాద కుట్రలు దేశాభివృద్ధిని అడ్డుకోలేవని స్పష్టం చేశారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ నాయకత్వంలో మన సైనిక శక్తి దేశానికి తెలిసిందని, అమాయకుల ప్రాణాలు తీస్తే మన సైన్యం ఉగ్రవాద శిబిరాలపైనే దాడి చేసిందన్నారు. గుంటూరులో జరిగిన తిరంగా ర్యాలీలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. పహల్గామ్ లో ఉగ్రదాడిని ఖండించిన పెమ్మసాని... ఆపరేషన్ సిందూర్ తో ఉగ్రవాదులను అంతం చేశామని చెప్పారు. ఆపరేషన్‌లో పాల్గొన్న సైన్యానికి అభినందనలు తెలిపి, దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీనాయక్ త్యాగాన్ని కొనియాడారు. ఎన్డీఏ ప్రభుత్వానికి దేశ రక్షణే మొదటి ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు.

# వైసీపీని నాశనం చేయడమే చంద్రబాబు లక్ష్యం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీని నాశనం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరిస్తోందని, చంద్రబాబు అప్రజాస్వామిక పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కూడా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించారన్న కక్షతోనే నిజాయతీపరులైన కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డిలపై తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేశారని భూమన ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలమైన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని విమర్శించారు. ఎక్కడా జరగని మద్యం కుంభకోణాన్ని సృష్టించి, అందులో జగన్‌ను ఇరికించి అరెస్ట్ చేయాలనే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇలాంటి తప్పుడు కేసులతో పాలన సాగించాలని చూస్తే ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నిజాయతీపరులైన అధికారులను జైళ్లకు పంపడం ద్వారా చంద్రబాబు సర్కార్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ ప్రతీకార చర్యలతో అధికారుల్లో ఆందోళన నెలకొందని ఆయన తెలిపారు.

# మహిళా శక్తితోనే మళ్లీ అధికారంలోకి

- మొదటి పేజి తరువాయి

ఉచిత బస్సుద్వారా ప్రతి కుటుంబాని కి నెల నెలా రూ.5 వేల రూపాయలు ఆదా అవుతున్నాయని అన్నారు. ఉచిత బస్సు కారణంగా నష్టాల ఊబిలో ఉన్న ఆర్టీసీ లాభాల బాట పట్టిందని, ఆ కార్పొరేషన్ లో పనిచేస్తున్నయాభై వేల మందికార్మికులు, వారి కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని చెప్పారు. ఈ 16 నెలల వ్యవధిలో ఆర్టీసీకి ఉచిత బస్సు ప్రయా ణాల కింద రూ. 2 వేల కోట్లు చెల్లించిందని అన్నారు. పేదలకు రూ.500 గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠ శాలల నిర్వహణ మొత్తం స్వయం సంఘాలకే అప్పగించామన్నారు. ఒకప్పుడు ప్రైవేటు కాం ట్రాక్టర్లు యూనిఫాంలు కుట్టించే బాధ్యత ఇచ్చే వారని, తాము మహిళా సమాఖ్యలకు 1.30 కోట్ల ఇచ్చామని చెప్పారు. పాఠశాల ప్రారంభం నాటికే యూనిఫాంలు సిద్ధంగా ఉంటున్నాయని అన్నారు. ప్రభుత్వం పరంగా ఏది కొనాలన్నా మహిళల నుంచే కొనుగోలు చేసేలా నిర్ణయం తీసుకుందని చెప్పారు. రాష్ట్రానికి వచ్చే అతి థులకు, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులకు ఇచ్చేగిఫ్ట్ కూడా మహిళా సంఘాలు తయారు. చేసినవే ఇవ్వాలని నిర్ణయం తీసుకొని అమలు చేస్తున్నట్టు సీఎం చెప్పారు.

## హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై తిరంగా ర్యాలీ..

- మొదటి పేజి తరువాయి

ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి, బీజేపీ యువమోర్చా, మహిళా మోర్చా, కిసాన్ మోర్చా కార్యకర్తలు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

మేప్రిల్ 22న జమ్మూ కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది టూరిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రస్థావరాలను, ఆర్మీ బేస్ లను ధ్వంసం చేసింది ఇండియా. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇరు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చాయి. ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయ్యిందనీ బీజేపీ శ్రేణులు తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నాయి.

# రేవంత్ కు ఉత్తమ్ నుంచి ప్రమాదం పొంచి ఉంది

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తమ పార్టీ నుంచి కాకుండా, ఆయన సొంత పార్టీ నేతల నుంచే ముప్పు పొంచి ఉందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతలు ఐదేళ్ల పాటు పరిపాలిస్తేనే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని, అప్పుడే కేసీఆర్ పాలన విలువ ఏంటో అర్థమవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లపాటు పాలించాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. రేవంత్ ఐదేళ్లు సీఎంగా కొనసాగాలన్నదే తమ అభిమతమని చెప్పారు. అయితే, రేవంత్ కి ఆయన సొంత పార్టీ నేతల నుంచే సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా సీనియర్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి నుంచి ప్రమాదం పొంచి ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఐదేళ్లు అధికారంలో ఉండాలని కేసీఆర్ కూడా ఆకాంక్షించారని, తాము కూడా అదే కోరుకుంటున్నామని పునరుద్ఘాటించారు.

కాగా, ఇటీవల తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా దాదాపు ఇలాంటి వ్యాఖ్యలే చేయడం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందంటూ వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ప్రభుత్వాన్ని కూలగొడితే తమకేం ప్రయోజనమని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజే, కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలని తాము ఆకాంక్షించామని, ఆ మాటకు కట్టుబడి ఉన్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# నీట్ పరీక్ష ఫలితాలకు బ్రేక్.. స్టే విధించిన మద్రాస్ హైకోర్టు

- మొదటి పేజి తరువాయి

దీంతో త్వరలో విడుదల కావాల్సిన ఫలితాల ప్రక్రియ నిలిచిపోయింది.వివరాల్లోకి వెళితే, మే 4వ తేదీన జరిగిన నీట్ యూజీ 2025 పరీక్ష సందర్భంగా ఒక పరీక్షా కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ఈ వివాదానికి కారణమైంది. సరైన వెలుతురు లేకుండానే పరీక్ష రాయాల్సి వచ్చిందని, అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ 13 మంది విద్యార్థులు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పరీక్ష నిర్వహణ ప్రక్రియ, దాని నిజాయతీ, సమగ్రతపై వారు పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం, నీట్ యూజీ 2025 ఫలితాల విడుదలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 2వ తేదీకి వాయిదా వేసింది.ఇదిలా ఉండగా, మధ్యప్రదేశ్ హైకోర్టుకు చెందిన ఇండోర్ బెంచ్ కూడా నీట్ ఫలితాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. దీంతో దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఫలితాలపై ఆందోళన నెలకొంది.

# త్వరలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ

- మొదటి పేజి తరువాయి

కమిషనర్‌లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మాన్సూన్ యాక్షన్ ప్లాన్, SNDP, పారిశుధ్యం, ఇంజనీరింగ్ నిర్వహణ, స్ట్రీట్ లైట్స్?పై చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. సమీక్ష సమావేశంలో హైదరాబాద్ అభివృద్ధి పనులపై చర్చించామని తెలిపారు. ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించానని చెప్పారు. వర్షాకాలంలో వచ్చే సమస్యలను తగ్గించేలా క్షేత్ర స్థాయిలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించానని తెలిపారు. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసి అర్హులకు అందజేస్తామని పేర్కొన్నారు. నగరంలో స్ట్రీట్ లైట్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని తెలిపారు. మెట్రో రైల్ చార్జీల పెంపుపై మంత్రి పొన్నం స్పందించారు. వయబుల్ కాని కారణంగా మెట్రో ఛార్జీలు పెంచినట్లు సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు.. దానిపై ప్రభుత్వం రివ్యూ చేస్తుందని చెప్పారు. హైదరాబాద్ ఇన్చార్జి మంత్రిగా నేను కూడా ఛార్జీలు తగ్గించమని విజ్ఞప్తి చేస్తానని అన్నారు.

# కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన, సండ్రుగు శ్రీకాంత్



**మే 17 ( సీ కే న్యూస్) చేగుంట :**కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన యువ నాయకుడు సండ్రుగు శ్రీకాంత్, చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బోయిని మురళి మరణించిన విషయం తెలుసుకున్న సండ్రుగు శ్రీకాంత్, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి, ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం మరియు 50కేజీ ల బియ్యం అందజేశారులి.ఈ కార్యక్రమంలో రుక్మాపూర్ గ్రామ అధ్యక్షుడు అంజ గౌడ్,మ్యాకల పరమేష్,అక్కానగారి సాయికుమార్ మ్యాకల నాగయ్య, మ్యాకల స్వామి,చాకలి రమేష్,చిట్టపారం బిక్షంగజ్జల,సాయిలు, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలుకుదాం



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 17 :** 21వ వార్డులో ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది దీంట్లో పౌరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో భాగంగా పీతల అవినాష్ వార్డు ప్రెసిడెంట్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏవైతే కార్యక్రమాలు అమలు చేస్తుందో వాటన్నిటిని పాటిస్తూ ఈ ఎండాకాలంలో సరైన పద్ధతులు పాటిస్తూ ఎండకి తట్టుకునే విధంగా చిన్న పిల్లలు ముసలి వాళ్లు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ మరియు పర్యావరణ కార్యదర్శిలు మరియు పారిశుధ్య సూపర్వైజర్లు పాల్గొనడం జరిగింది సానిటరీ ఇన్స్పెక్టర్ గోవిందరావు
పర్యావరణ కార్యదర్శులు
లావణ్య శ్రీ, భాను, నారాయణ రావు పారిశుధ్య మేస్త్రి మురళి సూపర్వైజర్లు కార్తీక్ రఫీ శ్రీను సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తి కుంటు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.

- రోజుకు 2.2 లక్షల టన్నులబొగ్గు ఉత్పత్తి, 2.4 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరపాలి.
- సమీక్ష సమావేశంలో చైర్మన్ మరియు ఎండీ ఎన్. బలరామ్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మే 17,**వర్షాకాలం సమీపిస్తూన్న నేపథ్యంలో సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా కుంటుపడకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండీ ఎన్. బలరామ్ అన్ని ఏరియాలోని జనరల్ మేనేజర్లను కోరారు. శనివారం ఆయన కొత్తగూడెం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, డైరెక్టర్లతో ఉత్పత్తి పై ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల ఓపెన్ కాస్ట్ క్వారీలలో నీరు నిలిచి బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడే అవకాశం ఉన్నందువల్ల ముందస్తుగా సంపులలోని నీటిని తొలగించడం కోసం తగినన్ని మోటారు పంపులను సమకూర్చుకొని సంసిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గనులవారీగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రోజుకు కనీసం 2.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.4 లక్షల టన్నుల బొగ్గు రవాణా సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్ ఈ అండ్ ఎం. డి. సత్యనారాయణ రావు, డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ మరియు పా కె. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్ డి. ఎం సుభాని, డైరెక్టర్ సి పి పి మనోహర్ , జి.ఎం మార్కెటింగ్ ఎన్. వి రాజశేఖర్ రావు లతో పాటు అన్ని ఏరియాలోని జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ లోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బి.వి.రామ్ చంద్రబాబు మనిషి ప్రాణానికే ఎసరు పెట్టిన పల్లా దుర్మార్గం ఇంకా ఎంతకాలం

- ఇది ప్రజా ప్రభుత్వం లేదా రాక్షస ప్రభుత్వం
- జగన్ భార్యపై పోస్ట్ పెట్టాడని కిరణ్ పై వేటు డ్రామాయేనా
- డా.సుధాకర్ ఇదేంటి అని ప్రశ్నించినందుకు చంపేసిన వైసిపి ప్రభుత్వానికీ చంద్రబాబుకూ తేడా ఏంటి
- అకృత్యాలపై పిర్యాదు కు మూకుమ్మడి దాడి చేయించి మట్టుబెట్టబోయిన పల్లా కు కాస్తున్న కాపు సంకేతం ఏంటి
- మరో డా.సుధాకర్ లా బి.వి.రామ్ పై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా హత్య ప్రయత్నం
- చంద్రబాబు, లోకేష్ లకు ఇంకా చేరలేదా



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 17 :** పోలీస్ కేసు కూడా నమోదవ్వకుండా చేసి పల్లా దుర్మార్గం కు టిడిపి సానుభూతి పరుణ్ణే లేపేసే మాఫియా పల్లా రాజ్యంలో సామాన్యునికి దిక్కేది విశాఖ వర్గాల్లో పెరుగుతున్న చర్చ తన పైన సోమవారం మధ్యాహ్నం జరిగిన దాడి గురించి బిజెపి ఫ్లోర్ లీడర్ మరియు విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుకు శనివారం మధ్యాహ్నం తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ వివరించారు. తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ప్రజలందరి కోసమా... ఆ పార్టీ లోని కొందరు ముఖ్య నేతల కోశం మాత్రమేనా అన్న సందేహం ప్రజల్లో పెరుగుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం కొందరు ఎమ్మెల్యేల స్వార్థంతో చేసిన దుష్ట ఆలోచన ఫలితంగా అప్పట్లో జీవీఎంసీ ఎన్నికలే లేకుండా పోయి తర్వాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ పత్తా లేకుండా పోవడం చూసాం. మళ్ళీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఇదే టీడీపీ మళ్ళీ గతాన్ని మించిన ఘోర తప్పులు చేస్తూ వంకర దుష్ట ఎమ్మెల్యే దుర్మార్గానికి దన్ను గా నిలబడి ఇదే ఎమ్మెల్యేల దుర్మార్గానికి అండగా నిలిచి మళ్ళీ ప్రజాగ్రహానికి గురి కాబోతుందా అంటే విశాఖలో పార్టీకి ప్రాణం పెట్టే వారి ప్రాణాలు తీసేందుకు సిద్ధం కావడం చూస్తే నిజం అనిపిస్తోంది. పాత సీఎం జగన్ హయంలో డా.సుధాకర్ మాస్కులు అడిగారని ప్రాణం తీశారని చెడ్డోడన్న జగన్ కి ధీటుగా నాలోని ఒరిజినల్ తత్వం అంతకంటే ఎక్కువే అని తన దుర్మార్గం పై పిర్యాదు చేసిన బి.వి.రామ్ పై వందల మందితో భౌతిక దాడి చేయించి ప్రాణాలు తీయబోయిన గాజువాక ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు ను వెనకేసుకొస్తూ చేసిన తప్పు సరిదిద్దని ప్రభుత్వ తీరు డా.సుధాకర్ లాగే బి.వి.రామ్ ను అంతం చేసే కుతంత్రం విశాఖ ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది. చంద్రబాబు నాయుడు కు ప్రాణం పెట్టే బి.వి.రామ్ పై జరిగిన మౌఖిక దాడి ప్రాణం తీసే దౌర్జన్యం పోలీస్ కమిషనర్ కు నేరుగా పిర్యాదు చేసినా గాజువాక పోలీసు లు ఇంతవరకూ కనీసం పోలీస్ కేసు నమోదు చేయకుండా కూడా చేసి పల్లా శ్రీనివాస రావు దుర్మార్గపు దౌర్జన్య కాండ ఎండగట్టి ప్రజాపక్షాన నిలిచిన బి.వి.రామ్ టీడీపీ పై ఉన్న అభిమానం కు పల్లా శ్రీనివాస రావు తన హెూదా తో చేటు చేసి చేస్తున్న దుష్ట చర్యలను బయట పెట్టి పార్టీ ఇమేజ్ కాపాడే ప్రయత్నం చేసిన బి.వి.రామ్ ను ఫ్యాక్షన్ విధానంతో మట్టుబెట్టి అణచివేసే దుష్ట చర్య తో పార్టీ కంటకుడిగా మారిన పల్లా శ్రీనివాస రావు కు దన్నుగా నిలబడి చంద్రబాబు కు ప్రాణం పెట్టే బి.వి.రామ్ ప్రాణం తీసేసేందుకు జరిపించిన దాడిని చంద్రబాబు, లోకేష్ బాబులు ఉపేక్షించడం పట్ల విశాఖ వాసుల్లో అనుమానాలు పెంచుతోంది. నేరుగా పిర్యాదు తీసుకున్న పోలీస్ కమిషనర్ వాస్తవాన్ని బయట పెట్టి, పల్లా శ్రీనివాస రావు పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన, ప్రెస్ మీట్ పెట్టి నిజం బయటపెట్టాల్సిన బాధ్యత ను పోలీస్ కమిషనర్ డా. శంఖ బాగ్చీ నిరూపించు కోవాల్సిన పరిస్థితి ఆయనపై ఉందని విశాఖ పౌరులు ఆశిస్తున్నారు. చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబులు దుర్మార్గం చేస్తున్న పల్లా శ్రీనివాస రావు పై ఎఫ్ఐఆర్ నమోదు చేయించి, శిక్షించాలని, పల్లా శ్రీనివాసరావు పదవులు నుండి తప్పించి ఇంకెవ్వరూ ఇంకెలాంటి తప్పులూ చేయకుండా హెచ్చరిక చేసి బి.వి.రామ్ వంటి చంద్రబాబును ప్రాణసమానంగా ప్రాణం పెట్టే వ్యక్తికే ప్రాణహాని చేసిన పల్లా శ్రీనివాస రావు ను ఉపేక్షిస్తే పార్టీ ప్రేమికులు, చంద్రబాబు, లోకేష్ బాబుల ఆత్మలుగా మెలిగే బి.వి.రామ్ వంటి వారు పల్లా శ్రీనివాస రావు వంటి వారికి బలైపోవాల్సిందేనా,
విగత జీవులై బలైపోవాల్సిందేనా అని నగర వాసులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.అనంతరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు స్పందిస్తూ ఇది ముమ్మాటికీ తప్పే ప్రజాస్వామ్యంలో ఎవరైనా ప్రశ్నించే హక్కు ఉంది కానీ ఇలా దాడి చేయడం ఇది మంచి సంస్కృతి కాదని చెప్పి ఆయన విచారణ వ్యక్తం చేశారు.

# ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలాగా వీధి వ్యాపారుల ప్రాంగణం తీర్చిదిద్దాలి...



- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- కొనుగోలుదారుల రద్దీ దృష్ట్యా మరిన్ని వసతులు ఏర్పాటు
- నిర్ణీత గడువులోగా వీధి వ్యాపారుల ప్రాంగణం అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మార్కెట్ ను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- పాతబస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, మే -17:**మౌళిక వసతుల కల్పనలో రాజీపడకుండా ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీధి వ్యాపారుల ప్రాంగణం అనువుగా ఉండే విధంగా అభివృద్ధి పనులు చేపట్టామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.

శనివారం జిల్లా కలెక్టర్, ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణం ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూరగాయలు అమ్మే షెడ్ లు, స్టాల్స్, చూస్తూ ప్రాంగణం మొత్తం కలియతిరుగుతూ వ్యాపారులతో ముచ్చటించారు. మార్చి 12న కలెక్టర్, వీధి వ్యాపారాల ప్రాంగణం ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా కూరగాయల వ్యాపారులు తమకు సరిపడా షెడ్లు లేవని, కొంతమంది వ్యాపారులు పట్టాలు కట్టి వ్యాపారం చేసుకుంటున్నామని , లైటింగ్ విద్యుత్ స్విచ్ బోర్డు ఏర్పాటు చేయాలని, వర్షాలు పడితే ప్రాంగణం బురదతో నీళ్లు నిలిచిపోతాయని, వ్యాపారులకు రెండు టాయిలెట్ కావాలని సమస్యలను కలెక్టర్ దృష్టి తీసుకువచ్చారు. క్షుణ్ణంగా సమస్యలు తెలుసుకున్న కలెక్టర్ తక్షణమే స్పందించి, సమస్యలకు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి యుద్ధప్రతిపాదన పనులు మొదలు పెట్టారు.

వీధి వ్యాపార ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు మార్కెట్ మధ్య వరుసలో ఏర్పాటు చేస్తున్న రెండు షెడ్ లు, వర్షం నీరు పోయే విధానం, టాయిలెట్ నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. నిర్ణీత గడువులోగా చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నాణ్యత ప్రమాణాల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని, అభివృద్ధి లో ఎక్కడ రాజీ పడకుండా ప్లాన్ ప్రకారం పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. నిర్మాణ పనులను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. మార్కెట్ వ్యాపారులు, కొనుగోలుదారులకు సౌకర్యవంతంగా ఉండేలా కావాలసిన అభివృద్ధి పనులు చేపట్టామని, వీటిని సైతం త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు తెలిపారు.

మనం ఆరోగ్యంగా ఉండాలంటే చెత్త, కూరగాయల వ్యర్థాలు ఉండకుండా జాగ్రత్తలు, నియమాలు తీసుకొని మార్కెట్ శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. వీధి వ్యాపారుల ప్రాగణంలో దుర్వాసన రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని, ప్రతి అంశాన్ని యంత్రాంగం మాత్రమే చేయాలని ఆశించకుండా ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని అన్నారు. ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కల్గించకుండా వారికి నమ్మకం పెంచేలాగా మర్యాదతో వ్యాపారం చేయాలని వ్యాపారులకు కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మున్సిపల్ ఇఇ కృష్ణలాల్, సంబందిత అధికారులు తదితరులు ఉన్నారు.

# డి ఎల్ సి సమావేశంలో 30 లేఔట్లలో 18 లేఔట్లు ఆమోదం



**సి కె న్యూస్ ప్రతినిధి:** నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో మొత్తం 30 లేఔట్లను పరిశీలించగా, వాటిలో 18 లేఔట్లకు అప్రూవల్ ఇవ్వడం జరిగింది.

ఈ సమావేశానికి ఇరిగేషన్, రెవెన్యూ మరియు ఇతర లైన్ డిపార్ట్మెంట్ల అధికారులు హాజరై లేఔట్లకు సంబంధించిన వివరాలను సమీక్షించారు. ప్రతీ లేఔట్ నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా అనే అంశాలపై సమగ్రంగా చర్చించి, అవసరమైన సూచనలు ఇచ్చారు.

లేఔట్ ఆమోద ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా, నిబంధనలకు లోబడి సరైన పద్ధతిలో లేఔట్లు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించబడింది.

# లైసెన్సుడ్ సర్వేయర్లకు 50 రోజుల పాటు శిక్షణ నిర్వహణ

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, మే -17:**
లైసెన్సుడ్ సర్వేయర్లకు 50 రోజుల పాటు శిక్షణ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం ప్రకారం 5 వేల మంది లైసెన్సుడ్ సర్వేయర్లకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొని, జిల్లా హెడ్ క్వార్టర్ లలో 50 రోజుల పాటు శిక్షణ అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు.

ఖమ్మం జిల్లాలో ఎంపికైన ప్రైవేట్ లైసెన్సుడ్ సర్వేయర్లకు మే 26 నుంచి జూలై 26 వరకు 50 రోజుల పాటు ఇల్లందు క్రాస్ రోడ్డు నందు గల ట్రైనింగ్ అండ్ టెక్నాలజీ డెవలప్మెంట్ సెంటర్ నందు శిక్షణ అందించడం జరుగుతుందని, దీనికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మోడెం వంశీని అభినందించిన భద్రాచలం ప్రధమ శ్రేణి న్యాయ మూర్తి శివ నాయక్.


- భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 17,**మే 5 నుంచి 12 వరకు ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్ లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించినందుకు భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కు చెందిన క్రీడాకారుడు మోడెం వంశి ని భద్రాచలం ప్రధమ శ్రేణి న్యాయ మూర్తి శివ నాయక్ అభినందించారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించి భారతదేశము యొక్క ఖ్యాతిని వినువీధులలో, ప్రకాశింప చేసిన, ఆదివాసి జాతి రత్నం, మోడెం వంశీని అభినందించడం జరిగింది. అంతేకాకుండా మారుమూల ఏజెన్సీ ప్రాంతం నుంచి ఒక ఆదివాసి గిరిజన యువకుడు ఇంటర్నేషనల్ స్థాయిలో బంగారు పతకాలు సాధించడం భద్రాచలం డివిజనకే గర్వకారణం అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా ఇది యువతకు స్ఫూర్తినిచ్చే గొప్ప విషయం అని కూడా తెలిపారు.తను కుడా ఒకప్పుడు కరాటే లో బ్లాక్ బెల్ట్ సాధించాను అని చెప్పి, తన తమ్ముడు కూడా జూడో లో స్టేట్ గోల్డ్ మెడల్ సాధించిన విషయం గుర్తు చేశారు.అప్పట్లో మాకు ఎలాంటి సహాయ సహకారాలు అందక క్రీడలను విడిచిపెట్టాము అని గతం తెలియ చేశారు.కానీ మోడెం వంశీ కి భద్రాద్రి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు వెన్నంటి ఉండి తనను ఈ స్థాయికి తీసుకుని వచ్చినందుకు సభ్యులను ప్రత్యేకంగా కొనియాడారు.ఈ కార్యక్రమం లో భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జీవి రామిరెడ్డి, వైద్యులు డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు రావి రామ్మోహన్రావు, పామరాజు తిరుమల్ రావు, సాధన పల్లి సతీష్, డిప్యూటీ రేంజర్ ఆఫీసర్ గుగులోతు శోభ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే సమాజంలో అసమానతలను తగ్గించే అవకాశం....

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఉన్న వనరులను ఉపయోగించుకొని విద్యార్థులు గొప్ప స్థాయికి ఎదిగి ఇతరులకు తోడ్పాటు అందించాలి
- పోటీ వ్యవస్థకు అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పని చేయాలి
- శ్రీ మిత్ర, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, ల్యాప్‌టాప్ లు, దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్




**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, మే -17:** చదువు కోసం చేసే సేవ శాశ్వతంగా నిలిచి పోతుందని, విద్యార్థులు బాగా చదివి సమాజంలో గొప్ప స్థాయికి ఎదిగి, మరో నలుగురి ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

శనివారం ఎన్.ఆర్.ఐ. ఫౌండేషన్ కార్యాలయంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 9 మంది విద్యార్థులకు శ్రీ మిత్ర ఫౌండేషన్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు లక్షల విలువైన ప్రోత్సాహక నగదు, ల్యాప్ టాప్ లను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు మన భవిష్యత్తు పౌరులు మాత్రమే కాక, దేశ అభివృద్ధికి పాలకులు కావాలని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్ని అవకాశాల్లో ముందంజలో ఉండాలని, ఇలాంటి ప్రోత్సాహకాలు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు.

మనం ఎక్కడ, ఏ ప్రాంతంలో పుట్టాం, ఎలాంటి పరిస్థితుల్లో పెరిగాం వంటి అంశాలు మన చేతిలో లేవని, మనం చేసే శ్రమతో మన పరిస్థితులను మార్చుకోవచ్చని అన్నారు. సమాజంలో ఉన్న అసమానతలను తగ్గించేందుకు విద్య ఎంత గానో ఉపయోగపడుతుందని తెలిపారు.

మనం నిర్దేశించుకున్న లక్ష్యం సాధించే వరకు శ్రమ కొనసాగించాలని, చివరి మెట్టు ఎక్కే వరకు దేవుని దర్శనం కాని విధంగా ఓపికగా శ్రమిస్తేనే మంచి సక్సెస్ దొరుకుతుందని అన్నారు. ఆశించిన ఫలితం రాని సమయంలో నిరుత్సాహ పడకుండా మరింత మెరుగ్గా కృషి చేయాలని తెలిపారు.

ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో అద్భుతమైన విజయాలు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ అభినందిస్తూ, పదవ తరగతి ఫలితాల్లో వచ్చిన ఫలితాలతో సంతృప్తి పడకుండా జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని, అప్పటి వరకు నిరంతరాయంగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

దేశంలో సంస్కరణలు వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్య, వైద్య రంగాల పట్ల కొంత నిర్లక్ష్యం జరిగిందని అన్నారు. ప్రస్తుతం విద్యా, వైద్యం పట్ల ప్రభుత్వం అధిక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలు శ్రద్ధ వహించాలని, అవి ఉచిత పాఠశాలలు అనే ఆలోచన తీసివేయాలని, ప్రజలు చెల్లించిన పన్నులతోనే ప్రభుత్వ ఉపాధ్యాయులు జీతాలు తీసుకుంటున్నారని, ప్రైవేటు పాఠశాలల్లో ఎలాగైతే ప్రశ్నిస్తామో అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా తల్లిదండ్రులు ప్రశ్నించాలని కలెక్టర్ కోరారు.

మనకు అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ గొప్ప స్థాయికి చేరుకోవాలని అన్నారు. చిన్న వయస్సులోనే పెద్ద లక్ష్యాలను నిర్దేశించు కోవాలని, లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలని, భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు, క్రీడాకారులుగా, వివిధ రంగాలలో పెద్ద స్థాయికి చేరుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి నెల జరిగే పేరెంట్ టీచర్స్ సమావేశాలకు రెగ్యులర్ గా హాజరు కావాలని, పిల్లలు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గమనించి, దానిని క్రమ పద్ధతిలో మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులతో కలిసి తల్లిదండ్రులు పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఇంటిలో కూడా పిల్లలు తప్పనిసరిగా కొంత సమయం చదివేలా చూడాలని అన్నారు. ప్రజల కోరికలోమార్పు వస్తే ఆటోమేటిక్ గా ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందని అన్నారు. మంచి పాఠశాలలు, మంచి ఆస్పత్రులు కావాలని, ఓటు హక్కు వినియోగ సమయంలో ఈ డిమాండ్లను ప్రజాప్రతినిధుల ముందు పెట్టాలని కలెక్టర్ తెలిపారు. గతంలో అమ్మాయిలకు చదువుకునే అవకాశం లభించలేదని, నేడు విద్యార్థులకు విద్య అవకాశాలు సులభంగా లభిస్తున్నాయని వీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

మనం ఎదిగే క్రమంలో అనేక మంది నిరుత్సాహపరుస్తారని, దొరికిన దానితో సంతృప్తి చెందమని ఉచిత సలహాలు అందిస్తారని, మనం నిర్దేశించుకున్న లక్ష్యం దిశగా ప్రణాళిక ప్రకారం క్రమపద్ధతిలో పనిచేస్తూ వెళ్లాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని విద్యార్థులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట తీసుకున్నారు.

ప్రభుత్వ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దటానికి సేవా సహాయాలు చేస్తూ విద్యార్థులకు విమాన ప్రయాణంతో ఢిల్లీకి 3 రోజుల విద్యా యాత్ర పార్లమెంట్ భవన్, రాష్ట్రపతి భవన్, ఇతర జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్థలాలను సందర్శించే విధంగా మరిచిపోలేని అనుభూతి కల్పిస్తున్న శ్రీ మిత్రా ఫౌండేషన్, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ప్రతినిధులను జిల్లా కలెక్టర్ అభినందించారు.

అనంతరం ఎన్.ఆర్.ఐ. ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వృద్దులకు వీల్ చైర్స్, ట్రై సైకిల్ లు, సామినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్ధలకు ల్యాప్ టాఫ్ లు కలెక్టర్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, శ్రీ మిత్రా గ్రూప్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్, డైరెక్టర్లు రంగా శ్రీనివాస్, పాలవరపు శ్రీనివాస్, చారుగుండ్ల రవికుమార్, చెరుకూరి యుగేందర్, నాగసాయి గ్యాస్ నగేష్, ఎన్ఆర్ఐ బాధ్యులు బయ్యన్న బాబు, బోనాల రామకృష్ణ, బండి నాగేశ్వరరావు, పసుమార్తి రంగారావు, వాసిరెడ్డి శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు వీల్ చైర్ లను అందజేసిన జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్




**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** బోనాల నిలయం ఎన్నారై ఫౌండేషన్ కార్యాలయంలో ఆరుగురు దివ్యాంగులకు జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ వీల్ చైర్ లను అందజేశారు . వికలాంగులకు వారికి మెరుగైన జీవన సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తున్న ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సేవలను అభినందించారు . ఈ కార్యక్రమంలో ఎన్నారై ఫౌండేషన్ యూఎస్ఏ అధ్యక్షులు శ్రీ బయ్యన బాబురావు , ఎన్నారై ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీ బోనాల రామకృష్ణ , కార్యదర్శి బండి నాగేశ్వరరావు , పసుమర్తి రంగారావు , వాసిరెడ్డి శ్రీనివాస్ , బత్తుల రాజేశ్వరి , సునీత , దొడ్డపనేని కృష్ణారావు , అర్జునరావు , అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు

# 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలి...

- ఉపాధి కార్మికులకు రోజు కూలి రూ"600/- ఇవ్వాలి.
- అర్హులైన వారందరికీ ఆత్మీయ భరోసా రూ" 12,000/- ఇవ్వాలి.
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 17,** 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని, ఉపాధి కూలీలకు రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని, అర్హులైన కూలీలందరకు ఆత్మీయ భరోసా 12వేల రూపాయలు అందివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బూర్గం పహాడ్ మండలంలో సారపాక గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి పని ప్రదేశాల పర్యటన చేయడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఉపాధి కూలీల సభలలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కాదని చట్టమని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత, అమలు చేసుకోవాల్సిన బాధ్యత మన పైనే ఉన్నదని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి నిధులు కోత పెడుతూ నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం ఎవరి దయాదాక్షణ్యాల వల్ల రాలేదని యూపీఏ ప్రభుత్వం పై ఆనాడు సిపిఎం వామపక్షాలు ఒత్తిడితో పాటు దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాట ఫలితంగా సాధించుకున్నదని అన్నారు. ఈ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని అన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆత్మీయ భరోసా రూ"12000/- లు అర్హులైన వ్యవసాయ కార్మికులందరికీ భూమి లేని కుటుంబాలకు అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మీయ భరోసా పేర్లు ప్రకటించినప్పటికీ నేటికీ అవి వారికి అందలేదని అన్నారు. రానున్న కాలంలో వ్యవసాయ కార్మికులు ఉపాధి కార్మికుల సమస్యల పై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ ఉపాధి సభలలో 400 మంది కార్మికులు పాల్గొన్నారు...

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం పై నిరసన కార్యక్రమం దిష్టి బొమ్మ దగ్ధం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మే 17,** నేషనల్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఉదయభాను రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి బీహార్ దర్భంగా లో రాహుల్ గాంధీ పర్యటనను అడ్డుకొని రాహుల్ గాంధీ పై కేసు పట్టి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఎన్డీఏ ప్రభుత్వానికి నిరసనగా..

నరేంద్ర మోడీ మరియు నితీష్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం..

యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బీహార్ దర్భాంగాలో అంబేద్కర్ వసతిగృహంలో దళిత విద్యార్థులను కలవడానికి వెళ్తున్న రాహుల్ గాంధీని అడుగడుగునా అడ్డుకోవడం మీ చేతగాని తనం అని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ తప్పుడు కేసులు పెట్టి ఎన్డీఏ పాలిత రాష్ట్రాలలో ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్న బిజెపి ఎన్డిఏ కూటమి ప్రభుత్వాలు అని అన్నారు.

రాహుల్ గాంధీ అంటే ఎందుకు మీకు అంత భయం మీరు ఎన్ని కేసులు పెట్టినా ప్రజల పక్షాన నిలబడే ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని రాహుల్ గాంధీ పై పెట్టిన తప్పుడు కేసులను తక్షణమే కొట్టి వేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడారి ప్రదీప్,జిల్లా జనరల్ సెక్రటరీ సుధీర్ కుమార్,జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు చింతిరాల అరుణ్ రాజ్, దుమ్ముగూడెం మండలం అధ్యక్షులు సిద్ది ప్రవీణ్ చర్ల మండల అధ్యక్షులు జితేంద్ర, టౌన్ వైస్ ప్రెసిడెంట్ అనిల్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ మణికంఠ, నాగరాజు,సాయి, సాంఘి, గొడుగు సాయి,ఎం బి రాజు, సాయి భార్గవ్,రేవంత్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు

# వ్యాపారం ఎలా సాగుతోందమ్మా..?

కొత్తగూడెం కలెక్టరేట్ లోని మహిళా శక్తి క్యాంటీన్ సందర్శనలో డిప్యూటీ సీఎం భట్టి, ఎంపీ రఘురాం రెడ్డి



**సికె న్యూస్ ప్రతినిధి కొత్తగూడెం:** "ఎలా ఉన్నారమ్మా.. వ్యాపారం బాగా జరుగుతోందా..?" అంటూ..కొత్తగూడెం కలెక్టరేట్ లోని ఇందిరా మహిళా శక్తి కాంటీన్ నిర్వాకులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి ఆత్మీయంగా పలకరించి వివరాలు తెలుసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శనివారం పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు విచ్చేసిన సందర్భంగా.. కలెక్టరేట్ లోని హెలిప్యాడ్ కు చేరుకున్న డిప్యూటీ సీఎం, ఎంపీ రఘురాం రెడ్డి...కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ లతో కలిసి లిఫ్ట్ సమీపంలో గల కాంటీన్ ను సందర్శించి.. లాభసాటిగా నిర్వహిస్తున్నారా..? అంటూ అడిగారు. "బాగుంది సార్.. క్యాంటీన్ బాగానే నడుస్తోంది.."అంటూ నిర్వాకులైన మహిళలు బదులివ్వగా.. సంతోషం వ్యక్తం చేశారు. ఆ తర్వాత.. డిప్యూటీ సీఎం భట్టి, ఎంపీ రఘురాం రెడ్డి అక్కడ కాఫీ సేవించి.. అధికారులతో సమావేశానికి వెళ్లారు.

# అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

**గత పదేళ్ల పాలనలో బీ ఆర్ఎస్ సర్కార్ చేసింది శూన్యం..**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర మంత్రి తుమ్మల, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**

**సికె న్యూస్ ప్రతినిధి,కొత్తగూడెం:** రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శనివారం కొత్తగూడెంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో శ్రీనివాస కాలనీ, పాండురంగా పురం ప్రాంతాలకు సంబంధించిన 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పాల్వంచ మండలం యానంబైల్ వద్ద రాజాపురం-ఉలవనూరు గ్రామాల మధ్య కిన్నెరసాని నదిపై హై లెవెల్ బ్రిడ్జిని ప్రారంభించారు. పాల్వంచ మండలం సోములగూడెం కొత్త బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడారు.

ప్రసంగాల్లోని ప్రధాన అంశాలు ఇలా..

రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత.. రెండో పెద్ద పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం ను మరింత అభివృద్ధి చేసుకుందాం. సింగరేణి, కేటీపీఎస్, అనేక ప్రతిష్టాత్మక పరిశ్రమలు, దక్షిణ అయోధ్య క్షేత్రం భద్రాచలం పుణ్యక్షేత్రం ఉన్న.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విమానాశ్రయం తీసుకొచ్చేందుకు విశేష కృషి చేస్తాం... తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని అందుకునే శక్తి దేశంలో ఏ రాష్ట్రానికి లేదు. పదేళ్లు ప్రజలు అధికారం ఇస్తే ఫామ్ హౌస్ లో పడుకొని, ప్రజల సొమ్ము దుబారా చేసి ప్రస్తుతం ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ఎదుగుదల చూడలేక అడ్డగోలుగా మాట్లాడే బీఆర్ఎస్ వారికి..అభివృద్ధి తోనే సమాధానం చెబుతాం. గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేలా, అడవి నష్టపోకుండా ఉండేలా ఇందిరా సౌర జల వికాసాన్ని ప్రారంభిస్తున్నాం.. గిరిజనులపై ఒక్క రూపాయి భారం లేకుండా ఈ పథకం కోసం రూ. 12,500 కోట్లు ఖర్చు చేయబోతున్నాం. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే లేనంత విద్యుత్ డిమాండ్ వచ్చినప్పటికీ చిన్న అంతరాయం లేకుండా రికార్డు స్థాయిలో విద్యుత్ సరఫరా చేశాము. ప్రాజెక్టుల నుంచి సాగునీటి కాలువలకు భూ సేకరణ చేస్తాం.. కాలువలు లేకుండా ప్రాజెక్టులు కట్టినా వృధా..రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పక్కా ప్రణాళికతో ముందుకు పోతోంది.గోదావరి నదిపై నావిగేషన్ కు అధ్యయనం చేయిస్తాం



# యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం



**సి కె న్యూస్ ప్రతినిధి:** ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి మరియు బీహార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం జాతీయ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ ప్రతిపక్ష నేత
రాహుల్ గాంధీ ని బీహార్ పోలీసులు అడ్డుకుని మరియు అంబేద్కర్ హాస్టల్‌లో దళిత విద్యార్థులను కలవకుండా ఎలా ఆపారో మనమందరం చూశాము, మోడీ మరియు నితీష్ కుమార్ లు రాహుల్ గాంధీ గారికి ప్రజలలో పెరుగుతున్న ఆదరణ చూసి ఎలాగైనా కాంగ్రెస్ పార్టీ దేశం లో లేకుండా చేయాలనే దురుద్దేశంతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ఒక మతతత్వ బీజేపీ పార్టీ కి త్వరలోనే దేశ ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం అని దానికి ఈ కేసులు, ఎఫ్ ఐ ఆర్ లు స్పష్టమైన సంకేతం అని ఇప్పుడు, సందర్భంగా పోలీసులు రాహుల్ గాంధీ గారిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసినట్లు వచ్చిన నివేదికలు వారి పాలిత రాష్ట్రాలలో బిజెపి-ఎన్డీఏ రాజకీయ ప్రతీకారం కొనసాగుతోందని రుజువు చేస్తున్నాయి
రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జెక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశానుసారం, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ మరియు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి ర్యాలీగా బయలుదేరి పాత బస్టాండ్ సెంటర్ లో ఎన్ డి ఏ ప్రభుత్వంలో భాగస్వామ్యం అయినటువంటి జె డి యు బీహార్ రాష్ట్రప్రభుత్వ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ దిష్టి బొమ్మ దహన కార్యక్రమం జరిగింది
ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా ఉపాధ్యక్షులు బాల గంగాధర్, ఆదర్శ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల మహేష్, క్రాంతి కుమార్, పాలేరు నియోజకవర్గ అధ్యక్షులు కిరణ్, వైరా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సత్యం (నిప్పు), ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఖైజర్,ముదిగొండ మండల అధ్యక్షులు నాగరాజు, ఖమ్మం పట్టణ యువజన నాయకులు ఆర్ కె నాయుడు, జితేందర్ నాయుడు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# దీవించయ్యా.. ముక్తేశ్వరా..

● సరస్వతీ నది పుష్కరాల్లో పుణ్యస్నానమాచరించిన రాష్ట్ర మంత్రి తుమ్మల, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి



సికె న్యూస్ ప్రతినిధి:భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలను పురస్కరించుకుని.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి .. శనివారం ఆ ప్రాంతానికి వెళ్లి సరస్వతి నదికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ పుణ్యస్నానం ఆచరించారు. ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని.. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో.. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హెలికాప్టర్ లో బయలుదేరి వచ్చారు.

## కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుకు కృషి చేస్తా..

ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 17, హైదరాబాద్ తర్వాత.. రెండో అతిపెద్ద పారిశ్రామిక కేంద్రమైన కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటు కోసం కేంద్రస్థాయిలో కృషి చేస్తున్నట్లు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి అన్నారు. గతంలో కేంద్ర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని పలుమార్లు కలిశామని, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా.. నుంచి కేంద్ర ప్రత్యేక బృందం కూడా వచ్చి సర్వే చేసిందని గుర్తు చేశారు. ఇక్కడి కలెక్టర్.. కేంద్రానికి ఓ రిపోర్ట్ కూడా ఇవ్వబోతున్నారని అన్నారు. అలాగే.. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించిన ముగ్గురు మంత్రులు ఉన్నారని, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అభివృద్ధికి వారు రాష్ట్రంలో మిగతా జిల్లాలన్నింటీ కంటే ఎక్కువ నిధులు ఇక్కడికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారని వివరించారు.

## వన్ టౌన్ పోలీస్ సీఐ జి డి బాబు ఆధ్వర్యంలో స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం



సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 17 : ఈరోజు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఇన్స్పెక్టర్ జి. డి. బాబు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది స్వచ్ఛందంగా... స్వచ్ఛ్ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 44 మంది పోలీస్ సిబ్బంది మరియు ప్రజాప్రతినిధులు సైతం భాగస్వామ్యం అయ్యారు.ప్రతి నెల 3వ శనివారం నాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని పద్ధతిగా నిర్వహించడం జరుగుతోంది. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణ శుభ్రపరిచే కార్యక్రమంతో పాటు, ఎవరి పని వారు చేసుకోవాలి, ఎవరిమీద ఆధారపడకూడదు అనే దృక్పథంతో ప్రతి ఒక్కరు తమ బాధ్యతను నెరవేర్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మార్గదర్శకాలు, పోలీస్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించనున్నట్లు ఇన్స్పెక్టర్ జి.డి. బాబు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా కేవలం పరిశుభ్రతను పెంపొందించడమే కాకుండా, క్రమశిక్షణ, బాధ్యతాయుత వాతావరణాన్ని ఏర్పరచడం జరుగుతుంది.

# కొత్తగూడెంలో విద్యుత్ సబ్ స్టేషన్లకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు.



● రాష్ట్ర అభివృద్ధిని అందుకునే శక్తి దేశంలో ఏ రాష్ట్రానికి లేదు.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 17,కొత్తగూడెం లో పలు విద్యుత్ సబ్ స్టేషన్ లకు శంకుస్థాపనలు చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లు ఫామ్ హౌస్ లో పడుకొని, ప్రజల సొమ్ము దుబారా చేసి ప్రస్తుతం రాష్ట్ర ఎదుగుదల చూడలేక అడ్డగోలుగా మాట్లాడే వారికి అభివృద్ధి తోనే సమాధానం చెబుతాంఅని గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేలా, అడవి నష్టపోకుండా ఉండేలా ఇందిరా సౌర జలవికాసాన్ని ప్రారంభిస్తున్నాం..గిరిజనులపై ఒక్క రూపాయి భారం లేకుండా ఈ పథకం కోసం 12,500 కోట్లు ఖర్చు చేయబోతున్నాం ఉమ్మడి రాష్ట్ర చరిత్ర లోనే లేనంత విద్యుత్ డిమాండ్ వచ్చినప్పటికీ చిన్న అంతరాయం లేకుండా రికార్డు స్థాయిలో విద్యుత్ సరఫరా చేశాము.. ఈ రాష్ట్రంలో కరెంటు తెచ్చిందే కాంగ్రెస్ కెసిఆర్ తెచ్చింది లేదు ఇచ్చింది లేదు అని అన్నారు .ప్రాజెక్టుల నుంచి సాగునీటి కాలువలకు భూ సేకరణ చేస్తాం. కాలువలు లేకుండా ప్రాజెక్టులు కట్టిన వృధా ఖర్చులు అవుతాయని రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పక్కా ప్రణాళికతో ముందుకు పోతోంది . గోదావరి నదిపై నావిగేషన్ కు అధ్యయనం చేయిస్తాం.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని అందుకునే శక్తి ఈ దేశంలో ఏ రాష్ట్రానికి లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

శనివారం ఆయన కొత్తగూడెం జిల్లాలో పలు విద్యుత్ సబ్స్టేషన్లకు, పాల్వంచలో హై లెవెల్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా కొత్తగూడెం కలెక్టరేట్లో ప్రసంగించారు. రాష్ట్రంలో సాఫ్ట్వేర్, ఫార్మా, విద్యుత్తు, హెల్త్, హౌసింగ్ వంటి పరిశ్రమలతో పాటు సంక్షేమ పథకాలతో రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందుతుంది అన్నారు. పదేళ్లు ప్రజల సొమ్ము దుబారా చేసి ఇంట్లో పడుకున్న వారు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఎదుగుదలను చూసి ఓర్వలేక అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, వారందరికీ అభివృద్ధి తోనే సమాధానం చెబుతామని డిప్యూటీ సీఎం అన్నారు.

గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేలా, అడవి నీ కాపాడుకునేందుకు ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని తీసుకువస్తున్నామని తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు అలాగే కృష్ణ పరివాహక ప్రాంతంలోని గిరిజనులకు ప్రతి మూడు నెలలు, ఆరు నెలలకు ఆదాయం వచ్చేలా ఇందిరా గిరి జిల్లా వికాసం పథకాన్ని రూపొందించాం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే బోర్లు వేయించి సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించి, డ్రిప్పు, స్ప్రింక్లర్లను ఏర్పాటుచేసి ఉద్యాన శాఖ ద్వారా అవకాడో, వెదురువంటి పంటలు సాగు చేయిస్తాం అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఈ పథకాన్ని ప్రారంభించబోతున్నాం గిరిజనులపై ఒక్క రూపాయి భారం పడకుండా 12,500 కోట్లు ఖర్చు చేయబోతున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. 2023 -24లో రాష్ట్రంలో 15వేల మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ ఉండగా గత పాలకులు అది కూడా సక్రమంగా చేయలేకపోయారని అన్నారు. రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి ఈ మార్చిలో 17,162 మెగావాట్ల పిక్ డిమాండ్ వచ్చినప్పటికీ చిన్న అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేశామని డిప్యూటీ సీఎం వివరించారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఈ విద్యుత్ డిమాండ్ ఏర్పడలేదు అన్నారు. థర్మల్ పవర్ తో పాటు హోస్టల్లో అందుబాటులో ఉన్న సోలార్, హైడల్, విండ్ పవర్ను వినియోగంలోకి తీసుకురానున్నట్టు అన్నట్టు తెలిపారు. 20,000 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికల రూపొందించుకొని ముందుకు పోతుందని తెలిపారు. ఈ రాష్ట్రంలో కరెంటు తెచ్చింది కాంగ్రెస్ ఇచ్చింది కాంగ్రెస్ మాత్రమే కెసిఆర్ పరిపాలనలో ఆయన తెచ్చింది లేదు ఇచ్చింది లేదు అన్నారు.

సీతారామ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత ప్రాజెక్టుగా ముందుకు తీసుకుపోతున్నామని తెలిపారు. ప్రాజెక్టు కాలువలకు కావలసిన భూసేకరణ చేపట్టాలని అందుకు అవసరమైన నిధులను విడుదల చేస్తామన్నారు. ప్రాజెక్టులు నిర్మించి సాగునీటి కాలువలు నిర్మించకపోవడంతో ఉపయోగ ఉండదని, బ్యారేజీలు, రిజర్వాయర్లు కట్టి వదిలేస్తే సముద్రం లో నీళ్లు ఉన్నట్టే కానీ ఉపయోగం ఉండదు అన్నారు.

గత పాలకులు 10 సంవత్సరాల కాలంలో ఏ ప్రాజెక్టు నుంచి ఒక్క ఎకరాకు సాగునీరు ఇవ్వలేదని, లక్ష కోట్లు ఖర్చు చేసిన కాలేశ్వరం నుంచి కూడా ఒక ఎకరం సాగునీరు అందలేదు అన్నారు. డిండి, ఎస్ ఎల్ బి సి ప్రాజెక్టులను గుర్తించి ప్రాధాన్యత అక్రమంలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది అన్నారు.

కేంద్ర నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులు, అభివృద్ధి పనుల గురించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఢిల్లీలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసిన డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలంతా కలిసి కేంద్ర మంత్రులతో సంప్రదింపులు జరుపుతారని, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంత్రులు కూడా ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులు అధికారులను కలుస్తారని వివరించారు. మన రాష్ట్ర ఎంపీలకు కావలసిన పూర్తి సమాచారం అందించాం, వారు చక్కగా పనిచేస్తున్నారని కితాబు ఇచ్చారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ సమగ్ర ప్రణాళికలతో ముందుకు పోతుంది అన్నారు. రాష్ట్రంలోని అనేక జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని, రీజినల్ రింగ్ రోడ్డుకు ఔటర్ రింగ్ రోడ్డుకు మధ్య ఫార్మా, అగ్రికల్చర్, హౌసింగ్ వంటి పలు రకాల క్లస్టర్లను నిర్మించబోతున్నట్టు తెలిపారు.

రాష్ట్రానికి సి పోర్టు లేదు రోడ్డు మార్గం ద్వారానే రవాణా జరుగుతుంది. రాష్ట్రంలో గోదావరి నదిపై రవాణాకు ఉన్న అవకాశాలనుపై అధ్యయనం చేయిస్తామని, అవకాశం ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు క్యాబినెట్ సృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకుంటానని డిప్యూటీ సీఎం తెలిపారు. ముందుగా నావిగేషన్ పై సమగ్ర అధ్యయనం జరిగేలా చూస్తానని తెలిపారు. అన్ని వర్గాల పిల్లలకు ఉచితంగా ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, మొదటి దశలోనే 104 నియోజకవర్గాల్లో ఈ పాఠశాలల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ ప్రారంభించాం అన్నారు. ఒక్కో పాఠశాలకు 200 కోట్లు ఖర్చు చేస్తున్నామని సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక పద్ధతుల్లో ఈ పాఠశాలల నిర్మాణం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంపీ రామ సహాయం రఘురామరెడ్డి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఎస్పీ రోహిత్ రాజ్ సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోడం వీరయ్య తదితర నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# పాల్వంచలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని మంజూరు చేయించండి.

**- రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల.**
**-ఆర్థిక, విద్యుత్ శాఖా మంత్రి భట్టి కి కాంగ్రెస్ వినతి.**

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 17,విద్యుత్ కేంద్రం నెలకొల్పడానికి అన్నీ వనరులు ఉన్న పాల్వంచ పట్టణంలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని మంజూరు చేయించాలని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖాల మంత్రి మల్లు భట్టి విక్రమార్కలి ను కోరారు. శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి పాల్వంచ పర్యటనకు వచ్చిన మల్లు భట్టి విక్రమార్క ను పాల్వంచ కాంగ్రెస్ నాయకులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ గత 60 సం"రాలుగా కేటీపీఎస్ థర్మల్ పవర్ స్టేషన్ ఏ బి సి యూనిట్లుగా కొనసాగేయని, కేంద్ర పర్యావరణ శాఖ ఏ యూనిట్ ను కూల్చివేశారన్నారు. అట్టి యూనిట్ ను వేరే ప్రాంతానికి మంజూరు చేయటం జరిగిందన్నారు. పాల్వంచలో తిరిగి యూనిట్ ను నెలకొల్పటానికి నీరు, బొగ్గు, స్థలం వంటి వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. తక్కువ రవాణా సౌకర్యం ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. వేరే ప్రాంతానికి కర్మాగారం పంపటం వలన వేలాది మందికి ఉపాది అవకాశాలు కోల్పోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తదుపరి అయినా విద్యుత్ కేంద్రం పాల్వంచలో నెలకొల్పుతారనే ఆశతో యువత వుందనీ, పాల్వంచలో 800 మెగా వాట్ల విద్యుత్ కేంద్రాన్ని నెలకొలిపి, ప్రాంత ప్రజలను ఆదుకోవాలని లికొత్వాల అన్నారు.

**మంత్రులు భట్టి, తుమ్మల, ఎంపీ రామసహాయం లకు స్వాగతం పలికిన నేతలు**

పాల్వంచ పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కు, వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, వైరా శాసనసభ్యులు మాళోత్ రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటేల్, %ఖ్రా% రోహిత్ రాజులి లకు కొత్వాల నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో లిమాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న,యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, కాంగ్రెస్ నాయకులు కాల్వ భాస్కర్ రావు, కనగాల నారాయణ, సాదం రామకృష్ణ, వై. వెంకటేశ్వర్లు, కాపర్తి వెంకటా చారి, కందుకూరి రాము, ఉండేటి శాంతి వర్ధన్, కాపా శ్రీను, పులి సత్యనారాయణ, మాలోత్ కోఠి నాయక్, ఉండేటి ధనయ్య, టి. రమేష్, చింతా నాగరాజు, వాసుమల్ల సుందర్ రావు, గంగిరెడ్డి భువన్ సుందర్ రెడ్డి, చాంద్ పాషా, డిష్ నాగేశ్వరరావు, భాషా తదితరులు పాల్గొన్నారు.



# పిడుగు పాటుకు ఇద్దరు చిన్నారులు మృతి



మే 17 ( సీ కే న్యూస్) చేగుంట : తూప్రాన్ మండల్ పరిధిలోని ప పొడలపల్లి గ్రామ శివారులో పిడుగుపాటుకు ఇద్దరు చిన్నారులు మృతి చెందన ఘటన, మరొక్కరికి, తీవ్ర గాయలు కాగ, పడాలపల్లి గ్రామానికి చెందిన, ప్రసాద్ వయస్సు, (15), సంవత్సరాలు, యశ్వంత్ వయస్సు (13), సంవత్సరాలు గ్రామంలో ఉన్నటువంటి కుంట వద్ద పిల్లలతో ఆడుకుంటుండగా ఉరుములతో మెరుపులతో కూడిన వర్షం కురిసింది, దీంతో చిన్నారులు చెట్టు కిందికి వెళ్ళగా, అప్పుడు చెట్టుపై పిడుగు పడడంతో చిన్నారులు అక్కడికి అక్కడే మృతి చెందారు, సంఘటన స్థలానికి చేరుకున్న తూప్రాన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

CK చంద్ర కాంత్ NEWS తెలుగు దినపత్రిక

# ఆగరు - నిలవరు

**బుజ్జగించినా.. ఫలితం లేకపోయే.. ఇక ఈ మీటింగ్ లు ఎందుకు డ్యూడ్**

వైసీపీ అధినేత జగన్ వరసగా సమావేశాలు పెడుతున్నప్పటికీ నేతలు మాత్రం పార్టీని వీడి వెళ్లిపోవడం ఆగడం లేదు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోతాడిపత్రి మున్సిపాలిటీ తప్ప దాదాపు అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు వైసీపీ పరమయ్యాయి. అయితే నాడు అధికారంలో ఉండటంతో పాటు క్యాడర్ కూడా పోటీ పడి పనిచేయడంతో అంతటి విజయం లభించింది. అదే సమయంలో మూడు చోట్ల జరిగిన గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం ఓటమిని చవి చూడాల్సి వచ్చింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి పరిస్థితి పూర్తిగా అందరికీ అర్థమయింది. కూటమికి అనుకూల వాతావరణం ఏర్పడిందని, వైసీపీకి ఇబ్బందికరమైన పరిస్థితులు వచ్చాయన్న అంచనాలు వినిపించాయి.

**గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఫలితాలప్పుడే...**

కానీ జగన్ మాత్రం గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను పెద్దగా పట్టించుకోలేదు. వన్ మ్యాన్ షోతో రెండోసారి విజయం సాధించాలని భావించారు. ఎవరు చెప్పినా తలకెక్కించుకోకపోవడంతోనే గత ఎన్నికల్లో పదకొండు స్థానాలకు పరిమితమయ్యారు. ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత నేతలతో పాటు స్థానిక సంస్థల నేతలు కూడా ఒక్కరూ మిగలడ లేదు. ఇప్పటికే చాలా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలూ కూటమి పరమయ్యాయి. ఛైర్మన్లు, మేయర్లు వారంతట వారే స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నారు. కూటమి అభ్యర్థి ఛైర్మన్ గానో, మేయర్ గానో ఎన్నిక కావడానికి అవసరరమైన మార్గాన్ని వారే సుగమం చేస్తున్నారు. కావాల్సినంత బలం ఉన్నప్పటికీ పార్టీ వీడే వారి సంఖ్య ఎక్కువగా ఉంది.


**సమావేశాలు ఏర్పాటు చేసినా...**

ఇక స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఆపేందుకు వరసగా తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించారు. వచ్చేది మన ప్రభుత్వమేనని, అప్పుడు కూడా పదవులు ఇతస్నమని భరోసా ఇస్తున్నారు. విశాఖ కార్పొరేటర్లతో సమావేశం అయి క్యాంపులకు తరలించినా చివరకు జగన్ మాటలను పెడచెవిన పెట్టి కార్పొరేటర్లు పార్టీని వీడి వెళుతున్నారు. జగన్ ఎంత నమ్మకంగా వచ్చేది మన ప్రభుత్వమేనని చెబుతున్నప్పటికీ ద్వితీయ శ్రేణి నేతలు విస్మరించడం లేదని అనడానికి ఇదొక నిదర్శనం అని చెప్పాలి. జగన్ సొంత జిల్లాలో కూడా నేతలు ఎవరూ ఉండటం లేదు. కడప మేయర్ ను ప్రభుత్వం తొలిగిస్తే, మేయర్ మున్సిపల్ ఛైర్మన్ మాత్రం తనంతట తానే తప్పుకున్నారు.

**అధికారంలో ఉన్ననాళ్లు...**

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచినా వారు సంతృప్తికరమైన పాలన అందించలేకపోయామని అంటున్నారు. తాము మేయర్ గా ఉన్నా, ఛైర్మన్లుగా ఉన్నా తమకు సరైన ప్రాతినిధ్యం ఇవ్వలేదని, కనీసం తమ కార్పొరేషన్లకు, మున్సిపాలిటీలకు నిధులు కూడా జగన్ ఇవ్వలేకపోయారని, ఎన్నికల్లో తాము డబ్బు ఖర్చు పెట్టి గెలిచి కూడా నిధులు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డామని చాలా మంది అంటున్నారు. ఎక్కువ మంది నేతలు పార్టీని వీడి వెళ్లడానికి ఆర్థికపరమైన ఇబ్బందులే కారణమి అంటున్నారు. అందుకే జగన్ ఎంత బుజ్జగించినా తాము మాత్రం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కూటమి పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# ప్రొటీన్ ఎక్కువ తీసుకుంటున్నారా..? అయితే ఈ సమస్యలు వస్తాయి.. జాగ్రత్త..!




మానవుని శరీరానికి ప్రొటీన్లు చాలా అవసరం. వీక్ గా ఉన్నప్పుడు కానీ.. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు గానీ డాక్టర్లు ప్రొటీన్లు ఉండే పదార్థాలు వాడాలని సూచిస్తారు. శరీరానికి అవసరమైన సూక్ష్మపోషకాల్లో ప్రొటీన్ ఒకటి. ప్రొటీన్ అమైనో ఆమ్లాలుగా విచ్ఛిన్నం కావడం వల్ల శరీరంలో కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది. దీనితో పాటుగా ఇది హార్మోన్లను నియంత్రిస్తుంది. అలాగే న్యూరోట్రాన్స్మిటర్లు, రోగనిరోధక పనితీరుకు కూడా చాలా అవసరమవుతుంది. అయితే ప్రొటీన్లు ఎక్కువగా వాడటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయో తెలుసుకుందాం. ముఖ్యంగా ప్రొటీన్లు ఎక్కువగా కలిగిన ఆహారం తింటే బరువు తగ్గొచ్చని డాక్టర్లు చెబుతుంటారు. కానీ అలాంటి ఆహారం తిన్నప్పుడు స్వల్పంగా అయితే బరువు తగ్గుతారు.. కానీ భవిష్యత్ లో మళ్లీ బరువు పెరగడానికి ఆస్కారం ఉంటుంది. ఎందుకంటే శరీరంలో కొవ్వువలే ఎక్కువ ప్రొటీన్ నిల్వ ఉండటంతో.. అమైనో ఆమ్లాల పరిణామం పెరుగుతుంది. దీంతో మళ్లీ బరువు పెరిగేందుకు ఛాన్స్ ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు. జంతువులతో వచ్చే ప్రొటీన్ తీసుకుంటూ, ఆహారంలో పండ్లు, కూరగాయలు వంటి ఫైబర్ ఎక్కువగా ఉండే మొక్కల ఆహారాన్ని తీసుకోకపోతే.. మీకు మలబద్ధకం సమస్య వచ్చే అవకాశం ఉంది. అలాగే ఉబ్బరం వంటి ఇతర జీర్ణ సమస్యలు కూడా వస్తాయి. అంతేకాకుండా ప్రొటీన్లు అధికంగా తీసుకోవడం వల్ల నోటి నుంచి దుర్వాసన వస్తుంది. ముఖ్యంగా కార్బోహైడ్రేట్లను బాగా తగ్గించినప్పుడు వాసన మరింత ఎక్కువవుతుంది. ఫైబర్ లేని పాలు, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని ఎక్కువ మొత్తంలో తీసుకుంటుంటే మీకు విరేచనాల సమస్య వచ్చే అవకాశం ఉంది.

అయితే ఒక వ్యక్తి వారి వయస్సు, లింగం, శరీర బరువు, శరీర కూర్పు, శారీరక శ్రమపై ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి శారీరక శ్రమలో పాల్గొనకపోతే.. వారు వారి శరీర బరువులో కిలోగ్రాముకు కనీసం 0.8 గ్రాముల ప్రొటీన్ ను క్రమం తప్పకుండా తీసుకోవాలి. మీరు రోజులో 1 గంట పాటు వ్యాయామాలు చేస్తే మీ శరీరంలోని 3 కిలోలకు 1.2 నుంచి 1.7 గ్రాముల ప్రొటీన్ ను తీసుకోవాలంటూ ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.



# తిండి విషయంలో ఈ తప్పులు చేయొద్దు!

## మానవాళి ఆరోగ్యంపై తిండి అలవాట్ల ప్రభావం

## ఆహారపు అలవాట్లు ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయంటున్న పరిశోధకులు

## మధ్యాహ్న భోజన విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచన

మానవుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అనేక అంశాలలో తిండి అలవాట్లు కూడా ముఖ్యమైనవే. ఆహారపు అలవాట్లు వ్యక్తుల ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయని పరిశోధకులు అంటున్నారు. తిండి విషయంలో చేసే కొన్ని తప్పులు చిన్నవే అయినా దీర్ఘకాలంలో చేటు చేస్తాయని, ప్రమాదకర జబ్బులకు దారితీస్తాయని చెబుతున్నారు. ఆహారం విషయంలో కొన్ని అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా మధ్యాహ్న భోజనం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. అవేంటో చూద్దాం...

ఉదయం అల్పాహారం తినకుండా మధ్యాహ్న భోజనం పీకల దాకా లాగించడం
తిన్నవెంటనే పనిచేయడం
మంచినీరు తక్కువగా తీసుకోవడం
పిచ్చిపట్టినట్టుగా తినడం
నిర్దిష్ట సమయం అంటూ లేకుండా ఎప్పుడంటే అప్పుడు లంచ్ చేయడం.
మధ్యాహ్న భోజన సమయంలో కనీసం స్నాక్స్ అయినా తీసుకోకపోవడం
లంచ్ లో ఎప్పుడూ జంక్, ప్రాసెస్డ్ ఫుడ్ తినడం
మధ్యాహ్నం భోజనం చేయాల్సిన సమయంలో టీ, కాఫీలు తాగడం
హడావిడిగా తినడం
పోషక విలువలున్న ఆహారానికి లంచ్ లో చోటివ్వకపోవడం
లంచ్ కు ఓ ప్రణాళిక అంటూ లేకపోవడం
మధ్యాహ్న భోజనంలో సమతుల ఆహారం తీసుకోకపోవడం

ఈ అలవాట్లన్నీ అప్పటికప్పుడేమీ ప్రభావం చూపవు, కానీ నిదానంగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి మొదట్లో వీటి లక్షణాలు ఓ మోస్తరుగానే అనిపించినా, కాలక్రమంలో కోలుకోలేనంతగా నష్టం వాటిల్లుతుంది.

సరైన రీతిలో మధ్యాహ్న భోజనం చేయకపోతే శరీరం తగినంత మోతాదులో కీలక విటమిన్లను, ఖనిజలవణాలను స్వీకరించలేదు. అస్తవ్యస్త భోజన సమయాలు మొదట జీర్ణవ్యవస్థను నాశనం చేస్తాయి. దాంతో ఉదరంలో జీర్ణరసాల ఉత్పత్తిలో సమతుల్యత ఉండదు. మొదట్లో చిన్న సమస్యలే అనుకున్నవి ఆ తర్వాత తీవ్రస్థాయికి చేరతాయి.

ప్రధానంగా, సక్రమమైన తిండి అలవాట్లు లేకపోతే మధుమేహం బారినపడే ముప్పు ఎక్కువ. సరైన సమయంలో ఆహారం తీసుకోకపోవడం, మధ్యాహ్న భోజనం వరకు పరగడుపునే ఉండడం శరీరంలో ఇన్సులిన్ స్థాయిలను కుదుపులకు గురిచేస్తాయి. దాంతో బ్లడ్ సుగర్ హెచ్చుతగ్గులకు లోనవుతుంది. ఇక, కొన్ని రకాల ఆహార పదార్థాలు క్యాన్సర్ కు దారితీస్తాయి. ఒబేసిటీతో పాటు 13 రకాల క్యాన్సర్లకు అనారోగ్యకర ఆహారమే కారణమని పరిశోధకులు గుర్తించారు. మెనింజియోమా, థైరాయిడ్, అడెనోకార్సినోమా, ఈసోఫేగస్, మల్టీపుల్ మైలోమా, కిడ్నీ, యూట్రస్, ఓవరీ, లివర్, గాల్ బ్లాడర్, ఉదరం, ప్యాంక్రియాస్, బ్రెస్ట్ క్యాన్సర్ లకు అనారోగ్యకరమైన తిండికి సంబంధం ఉందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.

మధ్యాహ్న భోజనంలో బలమైన పోషకాహారం తీసుకోకపోతే గుండె బలహీనపడుతుంది. అదే సమయంలో గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఉప్పు మోతాదు మించరాదు. ప్రతిరోజు పెద్దవాళ్లు 2,300 ఎంజీ కంటే ఎక్కువ ఉప్పు తీసుకోరాదు. అయితే ప్రస్తుతకాలంలో ప్యాకేజ్డ్ ఫుడ్స్ రూపంలో మనకు తెలియకుండానే ఉప్పు అధికంగా తీసుకుంటున్నాం. ఆరోగ్యకరమైన ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సోడియం వినియోగాన్ని నియంత్రించవచ్చు.

# ట్రెండీ లుక్‌తో అనసూయ అరాచకం!



మొదట టెలివిజన్ రంగంలో గుర్తింపు అందుకుని ఆ తరువాత బిగ్ స్క్రీన్‌పై తనదైన ముద్ర వేసుకున్న నటి అనసూయ భరద్వాజ్. ఆమె టాలెంట్ అందం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. యాంకర్‌గా ఉన్నప్పుడు హ్యూమర్‌తో ఆకట్టుకుంది. తర్వాత 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప' లాంటి సినిమాలతో నటిగా ట్రాన్సిషన్ అద్భుతంగా చేసుకుంది. ముఖ్యంగా పుష్పలో 'దాక్షయణి' పాత్ర ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది.ఇక లేటెస్ట్ గా అనసూయ చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బ్లాక్ టాప్, స్కై బ్లూ స్కర్ట్‌లో ఓ మోడ్రన్ లుక్‌తో మెరిసిపోతున్న అనసూయ స్టైలిష్ గా దర్శనమిచ్చింది. జస్ట్ క్లాసిక్ లుక్ అని చెప్పుకోవచ్చు. మెటాలిక్ ఫాబ్రిక్ టచ్, జిప్ డిజైన్ విత్ స్లీవ్‌లెస్ స్టైల్‌తో ఈ డ్రెస్సింగ్ మోడర్న్ యూత్‌కు తెగ నచ్చేసినట్లు లైక్స్ చూస్తేనే అర్థమవుతుంది.ఫోటోల్లో ఆమె ఎక్స్‌ప్రెషన్స్ మూడ్స్‌ను బాగా క్యాచ్ చేస్తూ కనిపించాయి. ఒక్కో పోజ్‌కి వేరే వేరే మూడ్‌ను చూపించగలిగిన అనసూయ ప్రొఫెషనల్ యాక్ట్రెస్‌గా ఎంత అభివృద్ధి చెందినదో స్పష్టంగా తెలుస్తోంది. ఆమె కళ్లలో కనిపిస్తున్న కాన్ఫిడెన్స్, కెమెరా ఫ్రెండ్లీ నేచర్ అన్నీ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేస్తున్నాయి. ఈ ఫోటోలకు భారీ లైక్స్ వస్తుండగా, అభిమానులు కామెంట్స్‌లో "కిల్లర్ లుక్", "ఎటిట్యూడ్ క్వీన్", "బోల్డ్ అండ్ బ్యూటిఫుల్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌కి ఫ్యాషన్ ట్రెండ్ చెప్పేలా అనసూయ ఈ ఫోటోషూట్‌లో నలుగురికీ ప్రేరణగా నిలుస్తోంది. ప్రస్తుతం స్టార్ మా ఛానెల్‌లో ప్రసారమవుతోన్న 'కిరాక్ బాయ్స్ అండ్ ఖిలాడీ గర్ల్స్ 2' షోకి అనసూయ యాంకర్‌గా వ్యవహరిస్తోంది. ఈ షోలో ఆమె హోస్టింగ్ స్టైల్‌తో పాటు ఈ విధమైన ఫోటోషూట్స్‌తో మరింత ఫాలోయింగ్ పెంచుకుంటోంది. కెరీర్‌లోనే కాకుండా స్టైల్ లోనూ అనసూయ ఎప్పటికీ ట్రెండింగ్‌లోనే ఉంటుంది అనడానికి ఈ ఫోటోలు నిదర్శనం.



**మేఘ చంద్ర పాత్రలో కోమలీ ప్రసాద్ యొక్క స్టైలిష్ అవతార్‌లు తప్పవు**



**తమన్నా భాటియా గ్లామర్‌ని పునర్నిర్వచించింది**

# ఈగో కూడా మంచిదే.. కానీ



డైరెక్టర్ పూరీ జగన్నాథ్ కు స్పెషల్ ఫ్యాన్స్ ఉంటారు. ఏ విషయం పై అయినా తన అభిప్రాయాన్ని సూటిగా చెప్తూ ఉంటాడు పూరీ. కరోనా టైమ్ నుంచి పూరీ మ్యూజింగ్స్ పేరుతో యూట్యూబ్ లో పలు అంశాలపై మాట్లాడుతూ ఆడియన్స్ ను ఆకట్టుకుంటున్నాడు పూరీ జగన్నాథ్. తన సినిమాలతో ఎలాగైతే ప్రేక్షకుల్ని మెప్పించాడో దీంతో కూడా అలానే యూత్ ను ఎట్రాక్ట్ చేస్తున్నాడు పూరీ. పూరీ మ్యూజింగ్స్ కి కూడా ఓ సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. ఆయన ఏ టాపిక్ మీద మాట్లాడినా ఎంతోమంది ఫాలోవర్లు దాన్ని వినడానికి ఆసక్తిగా ఉంటారు. రీసెంట్ గా పూరీ ఈగో అనే విషయంపై మాట్లాడాడు. ఈగో మంచిదేనని, అది మన సెల్ఫ్ రెస్పెక్ట్ ను కాపాడుతుందని, కాకపోతే ఈగో విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పూరీ జగన్నాథ్ అంటున్నాడు. అందరం నా బ్రెయిన్ లో ఉన్నది నేనే కదా అనుకుంటారని, కానీ కాదని, మన లోపల ఇంకొకడుంటాడని వాడి పేరే ఈగో అని, ఇది మొత్తం రన్ చేసేది వాడేనని, ఓవర్ థింకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కు వాడే సీఈఓ అని, ఎవరైనా నీ మీద జోక్ వేస్తే వాడు అనవసరంగా హర్ట్ అవుతాడని, ఎక్కడ లేని కోపమొస్తుందని, కోపంలో వాడోదో డెసిషన్ తీసుకుంటాడని పూరీ చెప్పాడు.ప్రతిక్షణం అవతల వారితో ఎలా డిస్కషన్ కు దిగాలి? అందులో మనమే గెలవాలంటే ఏం మాట్లాడాలనే విషయంపై ప్రతీక్షణం ట్రైనింగ్ ఇస్తుంటాడని, ప్రతీ దానికి లోపలి వాడికి కోపం వస్తుంటుందని, వాడెవడు మన కారుని ఓవర్‌టేక్ చేశాడు? మనకి ముందు చెప్పాలి కదా, మనకు ముందు పెట్టకుండా వేరే వాళ్లకు ముందు వడ్డిస్తున్నారేంటి ఇలా ప్రతీ విషయానికి లోపలి వాడు రియాక్ట్ అవుతూ ఉంటాడని పూరీ చెప్పుకొచ్చాడు. ఈగో వల్ల ఎన్నో గొడవలవుతాయని, అలా అని మన ఈగోని తీసేయలేమని, వాడు మన తోడబుట్టిన తమ్ముడు లాంటి వాడని, మనతోనే ఉంటాడని, కొంచెం లోతుగా ఆలోచిస్తే ఈ ఈగో బ్రదర్ మంచివాడేనని, మన ఆత్మాభిమానాన్ని కాపాడుతూ, మనం ఎవరి ముందు తలవంచకూడదని, తగ్గకూడదని కోరుకుంటూ ఉంటాడని, కాకపోతే వాడి వల్ల మనల్ని ఎంతో ఇష్టపడే వాళు కూడా బాధ పడతారని, ఫ్యామిలీలోని వాళ్లు, తల్లిదండ్రుల్ని కూడా ఈ ఈగో దూరం చేస్తుందని అందుకే ఈగోని దాచమని చెప్తున్నాడు పూరీ. ఈగోని దాచడం ఒక ఆర్ట్ అని, దాన్ని దాయగలిగితే సగం గొడవలు తగ్గుతాయని, ఎదుటివారితో మాట్లాడేటప్పుడు మీ ఇగోతో కాకుండా మీరే మాట్లాడండని, వాడిని మాట్లాడనివ్వకండని పూరీ జగన్నాథ్ తెలిపాడు.